క్లుప్తంగా

కాజ్‌వే పనులు ప్రారంభం



వడమాలపేట చీమలవారి వంక కాజ్‌వే పనులు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వడమాలపేట(విజయపురం): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట వద్ద చీమలవారి వంక కాజ్‌వే ఇరవై అడుగుల మేర కుంగింది. దీంతో వడమాలపేట మీదుగా వచ్చే బస్సులు, వాహనాలన్నీ బైపాస్ మీదుగా వెళ్లుతుండడంతో వడమాలపేట, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 'కాజ్‌వే పనులు ఎప్పుడు సార్' అనే శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు శనివారం పనులు ప్రారంభించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పుత్తూరు అన్నా గౌరి వైద్యశాల ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో పలు పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర రోగాలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు నేతాజీ, సరళ, ప్రియాక, రాజేంద్ర, సుధాకర్, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

గంగాధరనెల్లూరు: మండలంలోని పాతపాల్యం పంచాయతీ మొలకల కండ్రిగ, మిట్టకొత్తూరు గ్రామంలో పాడి రైతులు నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే థామస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువమంది రైతులు పాడిపశువులపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి గోకులం షెడ్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

తెరణి ఓంశక్తి ఆలయంలో చోరీ



పగలగొట్టి ఉన్న హుండీ

నగరి: మండలంలోని తెరణి గ్రామంలోని ఓంశక్తి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ గేటు తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లిన వారు హుండీని తాళాలు పగలగొట్టి అందులో ఉన్న కానులకు తీసుకెళ్లడంతోపాటు అమ్మవారి పూజలకు వినియోగించే హారతి తట్ట, దీపాలు కూడా దోచుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తి ప్రపత్తులతో ప్రదోష కాల పూజలు



విశేష అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఏన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. శనీశ్వరునికి తైలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.



గతంలో తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి వస్తోందంటే నెల రోజుల ముందు నుంచి టైలర్లు బిజీ బిజీగా ఉండేవారు. వచ్చిపోయే వారితో టైలరింగ్ షాపులు సైతం వస్త్రదుకాణంలా కళకళలాడేవి. చేతినిండా పని, జేబు నిండా డబ్బుతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం సాఫీగా సాగిపోయేది. ప్రస్తుతం వీరి పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా తయారైంది. సందుకో రెడీమేడ్ దుకాణం ఏర్పాటుతో పాటు చౌకగా వస్త్రాలు లభిస్తుండడంతో కొనుగోలుదారులు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో టైలర్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. గతంలో పదిమందికి పనులు కల్పించిన టైలర్లు నేడు ఒక్కరికే పనిలేదంటూ వాపోతున్నారు. – పుత్తూరు

- రెడీమేడ్ వస్త్రాలతో తగ్గిన పనులు
- నాటి వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలో రూ.10 వేల ఆర్థిక సాయం
- రూపాయి కూడా ఇవ్వని నేటి కూటమి ప్రభుత్వం

దయనీయం... దర్జీల జీవనం

గత రెండు దశాబ్దాలుగా రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి రావడంతో టైలర్ల కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఎటు చూసినా రెడీమేడ్ షాపులే కనిపిస్తున్నాయి. పుట్టిన బిడ్డ నుంచి సీనియర్ సిటిజన్ వరకు రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉన్నాయి. దానిని దీంతో గుడ్డ కొని తీసుకెళ్లి టైలర్ చేతికిచ్చి కుట్టమనేవారే కరువైపోయారు. రెడీమేడ్ నచ్చని సీనియర్ సిటిజన్లు కొంత మంది మాత్రమే టైలర్లకు పని కల్పిస్తున్నారు. మిగతా అంతా కొత్త ఫ్యాషన్‌కు అలవాటు పడి రెడీమేడ్ దుస్తులే వాడుతున్నారు. అలాగే చీరలకు ఫాల్స్, మ్యాచింగ్ జాకెట్లు కుట్టుకోవడానికి కోసమే టైలర్ల వద్దకు వస్తున్నారు. దీంతో టైలర్లు చాలీచాలని జీవనం గడుపుతున్నారు.



పుత్తూరులో దుస్తులు కుడుతున్న టైలర్

ఆదుకున్న వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రెడీమేడ్ షాపులతో ఆర్థికంగా చితికిపోతున్న టైలర్లను గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం వెన్నుతట్టి ఆర్థిక భరోసా కల్పించింది. ప్రత్యేక పథకం రూపొందించి, ప్రతి టైలర్‌కి ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించింది. దీంతో ఆర్థికంగా చితికిపోతున్న వారికి ఎంతో కొంత వెసులుబాటు కలిగించింది. అయితే నేటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టైలర్లకు గత ప్రభుత్వం ఇస్తూ వచ్చిన ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది. జీవనమే కష్టంగా ఉన్న ఈ తరుణంలో మళ్లీ టైలర్ల పరిస్థితి పెనుమీద నుంచి పొయ్యిలో పడ్డట్టైంది.

రూ.10 వేల సాయం పోయింది



గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా టైలర్లకు ఆర్థిక భరోసా కల్పించారు. ఏటా రూ.10 వేలు అందించి ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సాయం అందడం లేదు. పనులు లేక, ప్రభుత్వ ఆదరణ లేక మేము ఎలా బతకాలి. ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. – ఆర్.ఎస్.రమేష్, ప్రధాన కార్యదర్శి, టైలర్స్ యూనియన్, పుత్తూరు.

భారమైన కుటుంబ పోషణ



రెడీమేడ్ వస్త్రాలతో బేరాలు లేక ఆర్థికంగా చితికిపోయాం. దీంతో కుటుంబ పోషణ భారంగా తయారైంది. ఫాల్స్, జాకెట్లు కుట్టే పనికూడా లేకపోతే మా పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. జగనన్న ఇస్తూ వచ్చిన రూ.10 వేలు మాకు ఎంతో వెసులుబాటుగా ఉండేది. మా దురదృష్టం కొద్దీ ఆయన ఓడిపోవడతో మా కష్టాలు మరింత పెరిగాయి. – జ్యోతి, టైలర్, షాపుస్ట్రీట్, పుత్తూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



మాకు టైలరింగ్ తప్ప మరోపని తెలియదు. పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమైపోతున్నాం. ప్రభుత్వం టైలర్లకు రుణాలిచ్చి ఆదుకోవాలి. గత ప్రభుత్వంలో ఆర్థిక సాయం అందేది. ప్రసుత్తం రాష్ట్రంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఆర్థిక సాయం అందించలేదు. – సి.హరి, టైలర్, పుత్తూరు

నీరు తగ్గింది... తరలింపు మొదలైంది

- ఎడాపెడా తరలిపోతున్న ఇసుక



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

నగరి: కుశస్థలి నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఇసుకాసురులు తమ వేటను ప్రారంభించారు. సత్రవాడ, తెరణి, మిట్టపాళెం ప్రాంతాల్లో ఇసుక వ్యాపారులు అక్రమ తరలింపు మొదలుపెట్టారు. ప్రభుత్వం నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలకు, సీసీ రోడ్లకు, ప్రభుత్వ సంబంధిత పనులకు మాత్రమే ఇసుక తీసుకోవాలి. వంతెనల సమీపం, శ్మశానం సమీపం ఇసుక తీయకూడదు. అయితే ఈ నిబంధనలన్నీ వారు తుంగలో తొక్కేశారు. దాదాపు 100 ట్రాక్టర్లకు పైగా ఇసుకను తీసుకెళుతున్నారు. వంతెనల పక్కన, శ్మశానాల పక్కన ఇసుకను తోడేస్తున్నారు. ఇసుకను డంపింగ్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్లు స్థానిక యువజన సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. వారిని నివారించేందుకు వెళ్లే గ్రామస్తులను బెదిరిస్తున్నారన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పాలసముద్రం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని ప్రాంతాల్లో కోడి పందాలు, పేకాట నిర్వహించడం పూర్తిగా నిషేధమని శనివారం చిన్నరెడ్డప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. నిర్మానుష్య ప్రదేశాలలో నిషేధిత ఆటలు నిర్వహించకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పదవులను బాధ్యతగా నిర్వహిస్తాం



మాజీ మంత్రిని సత్కరిస్తున్న నూతన కమిటీ సభ్యులు

నగరి: తమపై నమ్మకంతో వైఎస్‌ఆర్ సీపీ ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, క్రియాశీలక కార్యదర్శిగా ఎంపికైన బీడీ భాస్కర, టీసీ మురగయ్య తెలిపారు. తమకు పదవులు రావడానికి కారణమైన మాజీ మంత్రి ఆర్కే రోజాను పూలదండలు, దుశ్శాలువాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీ ఉన్నతికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులు బాబు, చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

పుత్తూరు: స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం గోదాదేవి శ్రీరంగనాథుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలు.. మంగళవాయిద్యాలు.. అశేష భక్తజన సందోహం నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత కలశ ప్రతిష్ట చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వధూవరులుగా తీర్చిదిద్ది, కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రాసాదాలు పంపిణీ చేశారు.

ఆస్పత్రిలో మురుగు కంపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అత్యవసర విభాగం వెనుక భాగం కంపు కొడుతోంది. పారిశుధ్య, నిర్వహణ లోపం కారణంగా భవనాలకు మధ్య ఉన్న ఖాళీ స్థలం మురుగుతో నిండిపోయింది. ఈ మురుగు నిల్వలతో ఆప్రాంతం చెరువును తలపిస్తోంది.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ప్రజలు నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి, లేకపోతే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 66 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోటా దోమలు వృద్ధి చెంది ప్రాణాంతకరమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని చెప్పారు. దోమకాటుతో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ముందస్తు సంక్రాంతి సంబరాలు



పాలసముద్రం: మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అరుణోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం ప్రిన్సిపల్ హేమలత, హెచ్‌ఎం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగువల్లులు, గొబ్బిళ్ల పాటలతోపాటు పొంగళ్లు పెట్టి సంబరాలు చేపట్టారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: సంక్రాంతి సంబరాలు స్థానిక శ్రీలక్ష్మీ నరసింహా విద్యాసంస్థల్లో శనివారం అంబరాన్నంటాయి. డైరెక్టర్లు దిలీప్‌కుమార్, ధనుంజయరెడ్డి, పురుషోత్తం, వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ కిషోర్, వేణుగోపాల్, శ్రీను, శరవణ, జమున, నరేష్, పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్రాంతి పొంగళ్లు

చలి పంజా



ఆస్పత్రిలోని గదుల్లో కట్టిన పరదాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో చలి చంపేస్తోంది. రెండు రోజులుగా ఎండ జాడ లేదు. కారుమబ్బులు కమ్ముకుని చలిగాలులు వీస్తున్నాయి. అసలే శీతాకాలం.. దీనికి తోడు సాయంత్రం 5 గంటలకే మంచు మొదలవుతోంది. చీకటి పడగానే చలి పంజా విసురుతోంది. చిత్తూరు నగరంలోని జిల్లా ఆస్పత్రిలో మెడికల్ వార్డులో పలు విభాగాల్లోని కిటికీలకు తలుపులు సక్రమంగా లేవు. చలికి తట్టుకోలేక కిటికీలకు పరదాలు కట్టిపెట్టారు. అయినప్పటికీ రోగులు గజగజ వణికిపోతున్నారు. ఆ గదుల్లో ఉండలేకపోతున్నారు. బెడ్‌షీట్లు కప్పుకున్నప్పటికీ చలికి తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా చలిపులి జనాన్ని వణికించేస్తోంది.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609

భక్తిశ్రద్ధలతో ద్వాదశి వేడుకలు



ఊరేగింపులో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

కార్వేటినగరం: శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ద్వాదశి వేడుకలు వైభవంగా ముగిశాయి. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. అనంతరం తిరుప్పావై కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన శ్రీ సీత, రాముల వారి మూలవర్లకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నమాచార్య సంగీత కచేరి బృందం హరికథా కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, వేద పండితులు పాల్గొన్నారు.